# నల్గొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలనేదే నా సంకల్పం

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**విశ్వంభర, నల్గొండ** : సమస్యలు లేని పట్టణంగా నల్గొండ ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు . గురువారం అయన నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అన్నేశ్వర గుట్ట వద్ద అమృత్ 2 పథకం కింద కోటి నలభై ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 1100 కిలో లీటర్ల తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. మూడు కోట్ల 14 లక్షల 60000 వ్యయంతో వల్లభరావు చెరువు సుందరీ కరణ పనులకు శంకుస్థాపన చేశారు. లెప్రసీ కాలనీలో 3 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.లతీఫ్ సాబ్ గుట్ట సమీపంలో 50 లక్షల రూపాయల టి ఏ టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో నిర్మించిన ఎస్ ఈ2 యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 68.83 లక్షల రూపాయల వ్యయంతో సుందరీకరించనున్న మోతికుంట పనులకు శంకుస్థాపన చేశారు.నూతనంగా ప్రారంభించిన ఎస్ ఈ కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలలో నల్గొండ మున్సిపాలిటీని మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు చేస్తూ బిల్లు పాస్ చేయడం జరిగిందని , రాష్ట్ర ముఖ్యమంత్రి ,మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మేలో జరగనున్న మేయర్ ఎన్నికల్లో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు తొలి మేయర్ రానున్నారని ఆయన వెల్లడించారు. నల్గొండ పట్టణంలో 272 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నీటి సరఫరా పథకాలను చేపట్టడం జరిగిందని, 53 కోట్ల రూపాయలతో టి యుఎఫ్ ఐడిసి ద్వారా రోడ్లు, మురికి కాలువల నిర్మాణం పనులు జరుగుతున్నాయని, మరో 109 కోట్లతో సి సి రోడ్లు, 9 కోట్ల రూపాయలతో పట్టణం నలువైపులా సబ్ స్టేషన్లను చేపట్టడం జరిగిందని ,అందులో భాగంగా గురువారం రెండు సబ్ స్టేషన్లు ప్రారంభించుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టనున్నామని, మార్చిలోపు లతీఫ్ సాబ్ గుట్ట పనులను పూర్తి చేస్తామని, అలాగే బ్రహ్మంగారి గుట్ట వద్ద అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ,ఎవరు ఊహించని రీతిలో నిధులను తీసుకువచ్చి నల్గొండ ను అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో నల్గొండను స్మార్ట్ సిటీగా చేయాలన్నదే తన సంకల్పమని అన్నారు. కార్పొరేషన్ కావడం వల్ల నల్గొండకు రాష్ట్ర ప్రభుత్వం నుండే కాకుండా కేంద్రం ద్వారా నిధులు వస్తాయని, నల్గొండ టౌన్ ను మోడల్ టౌన్ గా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. 27 కోట్ల రూపాయలతో సెంట్రల్ లైటింగ్ పనులు సైతం పూర్తి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో నల్గొండ పట్టణాన్ని సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు .రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిలో భాగంగా 60 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ,20వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల ప్రణాళిక నడుస్తున్నదని, మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ వంటి వాటిని చేపట్టడం జరిగిందని మంత్రి వెల్లడించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బాగోని రమేష్ గౌడ్, ప్రజారోగ్య పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.



## పతంగుల పండగకు చెరువుల సుందరీకరణ

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**విశ్వంభర, హైదరాబాద్** : పతంగుల పండగను పురస్కరించుకుని హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల్లో ఏర్పాట్లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత పతంగుల పండగను పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనులను సమీక్షించారు.కూకట్‌పల్లి నల్లచెరువుతో పాటు మాదాపూరులోని తమ్మిడికుంట, పాతబస్తీలోని బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువులను ఆయన సందర్శించారు. మూడు నుంచి నాలుగు రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తి చేసి వేడుకలకు వేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించి, మొక్కలను విరివిగా నాటి చెరువులను మరింత అందంగా తీర్చిదిద్దాలని సూచించారు.చెరువుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని స్పష్టం చేసిన కమిషనర్, పరిసరాలను ప్రజలకు ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. నడక మార్గాలు, లైటింగ్, శుభ్రత పనులు, భద్రతా ఏర్పాట్లను వేగవంతం చేసి పండగ నాటికి చెరువులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

## జాతీయ భావజాలాన్ని బలోపేతం చేస్తున్న నిత్య జనగణమన




**విశ్వంభర, నల్లకుంట** : వందే ప్రజా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య 'జనగణమన' కార్యక్రమాన్ని అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రతి బస్తీకి విస్తరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నల్లకుంటలో జెండా కేంద్రంలో ఈ కార్యక్రమం 1300 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య సేవలను గుర్తు చేస్తూ జాతీయ జెండా ప్రస్థానాన్ని వివరించారు. మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న బాలకృష్ణ గురుస్వామి జాతీయతా స్ఫూర్తి, నిత్య జనగణమన ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఈ సందర్భంగా నిత్య 'జనగణమన' నిర్వహకులు ఎన్ మధు ,శ్రీనివాస్ లు అతిథులను, సీత రామచందర్ రావు ఉపేంద్ర ప్రసాద్ దుబే, డి.ఎన్. రావు, దుబాసి ప్రతిభ తదితరులను శాలువాలతో సత్కరించారు. వివిధ రాజకీయ, సామాజిక రంగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలలతో లైంగిక వేధింపులపై ఇంటర్వ్యూ చేసిన యూట్యూబర్ అరెస్ట్



**విశ్వంభర, హైదరాబాద్** : మైనర్లతో లైంగిక వేధింపుల వీడియోలు చేస్తూ, వారి ఇంటర్వ్యూలు యూట్యూబ్‌లో ప్రచారం చేసిన ఏపీకి చెందిన యూట్యూబర్ కంబేటి సత్యమూర్తిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు విశాఖపట్నం లోని విశాలాక్షినగర్‌కు చెందినవాడుగా గుర్తించారు. ఇతడు వైరల్ హబ్ అనే యూట్యూబ్ ఛానెల్‌ను నిర్వహిస్తూ.. అభ్యంతరకరమైన, పిల్లలపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నాడు.'వైరల్ హబ్ 007' పేరుతో ఉన్న యూట్యూబ్ ఛానల్‌లో చాలారోజులుగా ఆయన పలువురు బాలలను ఇంటర్వ్యూలు చేస్తున్నారు. అయితే, అందులో మైనర్లతో అశ్లీల ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 2025 అక్టోబరు 16న తన ఛానల్‌లో పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు ప్రసారం చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. దీంతో వారు సుమోటోగా కేసు నమోదు చేశారు.ఏపీకి చెందిన కంబేటి సత్యమూర్తి రన్ చేస్తున్న సదరు యూట్యూబ్ ఛానల్‌లో 18 ఏళ్ల లోపున్న మైనర్ల ఇంటర్వ్యూలు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. వీటిలో నిందితుడు కావాలనే పిల్లలను అసభ్యకరమైన, లైంగికపరమైన అశ్లీల ప్రశ్నలు అడగటమే కాకుండా.. మైనర్లు ముద్దులు పెట్టుకునేలా ప్రేరేపించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇదంతా తన ఛానల్‌లో వ్యూస్ పెంచుకోవడానికి ఆయన ఇలాంటి ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సత్యమూర్తి 2018 నుంచి యూట్యూబర్‌గా పనిచేస్తూ.. వైరల్‌హబ్007 అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లూయెన్సర్లతో అసభ్య భాషలో ఇంటర్వ్యూలు చేసి, వ్యూస్ పెంచుకొని ఆదాయం పెంచుకోవాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వీడియోలు చేసినట్లు పోలీసులు ఆరోపించారు. ఇతడు బాలల రక్షణ చట్టాలు, సైబర్ చట్టాన్ని ఉల్లంఘించాడని చెప్పారు. సైబర్ ఏసీపీ శివమారుతి పర్యవేక్షణలో ఎస్ఐ సురేశ్ తమ బృందంతో కలిసి నిందితుడు సత్యమూర్తిని వైజాగ్‌లో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. నిందితుడిని డిజిటల్ ఎవిడెన్స్ తో అదుపులోకి తీసుకుని పోక్సో, ఐటీ చట్టాల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో వ్యూస్ పెంచుకునేందుకే అలాంటి ఇంటర్వ్యూలు చేసినట్టు సత్యమూర్తి ఒప్పుకున్నాడు.

## పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం

**మరోసారి దాతృత్వాన్ని చాటుకున్న అధినేత మాజీ సీఎం కేసీఆర్**



**విశ్వంభర, ఎర్రవల్లి** : విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మరణించిన ఎర్రవెల్లి గ్రామ నివాసి పేద రైతు చిన్నాజు సత్తయ్య కుమారుడు, స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలో బి టెక్ చదువుతున్న నవీన్, అదే గ్రామానికి చెందిన, ప్రమాద వశాత్తూ కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన,మరో పేద రైతు పెద్దోళ్ల సాయిలు కొడుకు, బి టెక్ చదువుతున్న అజయ్., లను చేరదీసి వారి ఇంజనీరింగ్ చదువు పూర్తికాలపు ఫీజులను బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ చెల్లించారు. వారికి అవసరమయ్యే పుస్తకాలు, కంప్యూటర్ ల కోసం కూడా ఆర్థిక సాయం అందించారు.ఈ మేరకు వారికి విడి విడి గా చెక్కులుఅందించారు.ఈసందర్భంగా "కష్టపడి మంచిగ చదువుకోండి బిడ్డా.. మీరు కష్టపడి గొప్ప స్థాయిని చేరుకోవాలె. మీరు.. ఫీజులకోసం భయపడొద్దు. యే సమస్య వచ్చినా నేనున్న.." అంటూ భరోసా నిస్తూ కేసీఆర్ ఆశీర్వదించారు. అలాగే విద్యుత్ ప్రమాదంలో మరణించిన చిన్నాజు సత్తయ్య కుటుంబానికి సంబంధిత విద్యుత్ శాఖ నుంచి చట్టపరంగా అందే ఆర్థిక తదితర సాయం గురించి పర్యవేక్షించి వారికి న్యాయం జరిగేలా చూడాలని తన వ్యక్తిగత కార్యదర్శి నాగేందర్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు.కాగా... కుటుంబ పెద్దను కోల్పోయిన తమను గుర్తించి, ఆదరించి, ఆర్థికంగా ఆదుకుని, తమ పిల్లల చదువు, భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన కేసీఆర్ గారికి, పిల్లల తల్లులు చేతులెత్తి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ చదువుకోసం భరోసాగా నిలిచిన కేసీఆర్ గారికి ఎర్రవెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా

**రూ.1.24 కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం**



**విశ్వంభర, హైదరాబాద్** : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పర్యావరణానికి, పక్షులకు హానికరమైన నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలపై హైదరాబాదు నగర పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నగరవ్యాప్తంగా రూ.1.24 కోట్ల విలువైన నైలాన్, సింథటిక్ మాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, చైనీస్ మాంజాపై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించిందని, విక్రయం, నిల్వ, అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల తనిఖీలతో పాటు ఈ-కామర్స్, సోషల్ మీడియా వేదికలపై 24 గంటల నిఘా కొనసాగుతోందని తెలిపారు. నిషేధిత మాంజా వల్ల విద్యుత్ షాక్, ప్రాణాపాయం ఉన్నందున సంప్రదాయ నూలు దారాలనే వినియోగించాలని తల్లిదండ్రులకు సూచించారు. అక్రమ విక్రయాలపై డయల్ 100 లేదా వాట్సాప్ 94906 16555కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగరవ్యాప్తంగా ఇప్పటివరకు 103 కేసులు నమోదు చేసి 143 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తం 6,226 మాంజా బాబిన్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న అధికారులను కమిషనర్ అభినందించి నగదు బహుమతులు అందజేశారు.

## రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగుల ధర్నా

**ఇరవై మంది అరెస్ట్ – సిటీ సెంటర్ లైబ్రరీ వద్ద తీవ్ర ఉద్రిక్తత**




**విశ్వంభర, చిక్కడపల్లి** : జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు హైదరాబాదు అశోక్‌నగర్‌లోని సిటీ సెంటర్ లైబ్రరీ వద్ద నిర్వహించిన ధర్నా ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. గురువారం సాయంత్రం లైబ్రరీ వద్ద నుంచి నిరుద్యోగులు, విద్యార్థులు గుంపులు గుంపులుగా అశోక్‌నగర్ చౌరస్తా వైపు ర్యాలీగా కదిలారు. వెంటనే ఉద్యోగాలు భర్తీ చేయాలని నినాదాలు చేస్తూ ముందుకు సాగగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ర్యాలీ అశోక్‌నగర్‌కు చేరుకోగానే ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకొని చెదరగొట్టారు. అయినా కొందరు నిరుద్యోగులు ధర్నాకు ప్రయత్నించడంతో సుమారు ఇరవై మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో అశోక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి మరింత ఉద్రిక్తం కాకుండా పోలీసులు ఆ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకొని, నిరుద్యోగులు, విద్యార్థులను కట్టడి చేశారు.

## చైనా మాంజా అమ్మినా, వాడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

**వ్యాపారులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం**

**హైదరాబాద్ సీపీ సజ్జనార్ సీరియస్ వార్నింగ్**



**విశ్వంభర, హైదరాబాద్** : చైనా మాంజా పై సిటీ పోలీసులు కీలక నిర్ణ యం తీసుకున్నారు. చైనా మాంజాను కొనుగోలు చేసినా, అమ్మినా, వాడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ భారీగా నిషేదిత మాంజాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ మాట్లాడుతూ, చైనా మాంజాతో గాలిపటాలు ఎగరేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే చైనా మాంజా కారణంగా ఎవరికైనా గాయాలు జరిగితే, బాధ్యులపై అదనపు కేసులు కూడా పెడతామని హెచ్చరించారు. అవసరమైతే చైనా మాంజా విక్రయించే వారిపై పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) కూడా ప్రయోగించే ఆలోచన చేస్తున్నట్లు సజ్జనార్ హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## ఎర్దనూరు చౌడమ్మ జాతరలో పాల్గొన్న జగ్గారెడ్డి

**విశ్వంభర, కంది** : కంది మండలం ఎర్దనూరు గ్రామంలో జరిగిన శ్రీ చౌడమ్మ తల్లి జాతర ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. చౌడమ్మ తల్లి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడమ్మ తల్లి చరిత్ర గురించిన విశేషాలను వివరిస్తూ, ఒగ్గు కళాకారులు పాడిన పాటలను విన్నారు. ఎర్దనూరు గుట్టపైన కొలువైన దేవతామూర్తులను దర్శించుకున్నారు. చౌడమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రఘుగౌడ్, ఎర్దనూరు సర్పంచ్ పంబల్ల జ్యోతి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

## రేపు సీనియర్ జర్నలిస్టు లక్ష్మణ రావు సంతాపసభ



**విశ్వంభర, చిక్కడపల్లి** : అనారోగ్యంతో ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు టీకే లక్ష్మణ రావు సంతాపసభను ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాదు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో నిర్వహించనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది.ఈ విషయాన్ని ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. దాదాపు నలభై ఏళ్ల పాటు పలు ప్రధాన పత్రికల్లో పనిచేసిన లక్ష్మణ రావు పత్రికారంగానికి, జర్నలిస్టులకు విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పత్రికా రంగంలో లక్ష్మణ రావుతో కలిసి పనిచేసిన సీనియర్ పాత్రికేయులు, సన్నిహితులు, ఆత్మీయులు, జర్నలిస్టులు ఈ నెల 10న జరిగే సంతాపసభకు హాజరై నివాళులు అర్పించాలని మామిడి సోమయ్య కోరారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష

**విశ్వంభర, ఎల్బీనగర్** : ఫోక్సో కేసులో నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష పడిన సంఘటన సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గతంలోకి నమోదైన కేసులో నేర రుజువు కావడంతో రాము (22)ను దోషిగా నిర్ధారించిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం. ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 15 వేల జరిమానా విధించింది. బాధితురాలికి లక్ష పరిహారం మంజూరు చేసింది.

**అక్రమ మద్యం, మాదకద్రవ్యాల కట్టడిలో**

## ఎక్సైజ్ అధికారుల పాత్ర కీలకం



**విశ్వంభర, హైదరాబాద్** : ఎక్సైజ్ శాఖ అధికారులు నిబద్ధతతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ ఫోరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణాను కట్టడి చేయడమే అధికారుల ప్రధాన బాధ్యతన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్సైజ్ అధికారుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని భరోసా ఇచ్చిన మంత్రి, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి శాఖ ప్రతిష్టను పెంచాలని ఆకాంక్షించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..

**నలుగురు విద్యార్థులు మృతి**

**విశ్వంభర, శంకర్‌పల్లి** : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మిర్జగుడ సమీపంలో గురువారం జనవరి 8 తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు కళాశాల విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. శంకర్‌పల్లి మండలంలోని దొంటనపల్లి ఐబీఎస్ (IBS) కళాశాలలో బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హైదరాబాద్‌కు కారులో వస్తుండగా, మిర్జగుడ గేట్ వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు *సుమిత్ (20), నిఖిల్ (20), రోహిత్ (18), సూర్యతేజ (20)*గా గుర్తించారు. అదే కారులో ప్రయాణిస్తున్న నక్షత్ర (20) తీవ్రంగా గాయపడగా, ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను చెవెల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని ప్రాథమికంగా భావిస్తున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో కళాశాల వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## చంద్రబాబు 'రెడ్ బుక్' ఫాలో అవుతున్న రేవంత్ : ఆర్ఎస్పీ

**విశ్వంభర, బ్యూరో** : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు రెడ్ బుక్ ఫాలో అవుతున్నాడని మాజీ ఐపిఎస్ అధికారి, బిఆర్ ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో వేధిస్తున్నారని చెబుతూ అధికారులు చట్టాన్ని గౌరవించాలని కాని , ముఖ్యమంత్రి కార్యాలయంలోఉన్న వారి సంతృప్తి పరిచేందుకు పనిచేయరాదని ఆయన చెప్పారు. " చంద్రబాబు నాయుడు 16 మంది అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా ఆరు నెలల పాటు ఘోరంగా అవమానించాడు. ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను జైలుకు పంపాడు. ఇదేమని అడిగే వాళ్ల పేర్లు మా రెడ్ బుక్ లో ఉన్నాయంటున్నాడు. అదే దారిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నది, "అని ఆయన అన్నారు. విచారణ పేరుతో అధికారుల కుటుంబ సభ్యులనుకూడా వేధిస్తున్నారని, గంటలతరబడి పోలీస్ స్టేషన్లలో వేచి ఉండేలా చేస్తున్నారని, కుటుంబ సభ్యులు వేధించడం సబబు కాదు. ప్రభాకర్ రావు కుటుంబసభ్యులను తెచ్చి పోలీస్ స్టేషన్‌లలో గంటలు గంటలు కూర్చోబెట్టి విచారిస్తే వాళ్లకేం తెలుస్తుంది ఆయన అన్నారు."అధికారులకు ఒకప్పటి సహచరుడిగా చెప్తున్నా.. మీకు చేతులు జోడించి చెబుతున్నా.దయచేసి చట్టాన్ని గౌరవించండి. ఎవరి మెప్పుకోసమో, ముఖ్యమంత్రి గారి మెప్పుకోసమో, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉండే స్వార్థపరులు, కబ్జా దారులకోసం ఆయన మీ సహచరుడు ప్రభాకర్ రావును, ఆయన కుటుంబసభ్యులను ఇబ్బందులు పెట్టకండి,"అని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో పంజాబ్ రాష్ట్రంలో టెర్రరిజం బలంగా ఉన్న రోజుల్లో ఎంతో గొప్పగా పనిచేసిన అధికారుల మీద ట్రిబ్యునల్ వేసి సతాయించినందువల్ల, టార్చర్ చేసినందు వల్ల టెర్రరిస్టులు అని ముద్ర వేసి ఇబ్బందులు పెడితే, వాళ్ళు అవమానం తట్టుకోలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. అదే రీతిలో ఇపుడు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును వేధిస్తున్నారు. ఆ పరిస్థితులు తెలంగాణలో తీసుకురావొద్దు," అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు.